కథానిక

# దొంగా - దొరా

వసశ్రీ

ఎక్స్‌ప్రెస్ పొగలు కక్కుకుంటూ వొచ్చి స్టేషన్‌లో ఆగింది. ఆ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రెండునిముషాలకంటె ఎక్కువ ఆగదు. ఆదరాబాదరాగా ఎదురుగావచ్చిన సెకండ్‌క్లాస్ పెట్టె తలుపు తోసుకొని ఎక్కి కూర్చొన్నాను.

అదిచాలా చిన్న కంపార్టుమెంటు కావడాన రెండుబెర్తులు మాత్రమే ఎదురెదురుగా వున్నయ్. ఇద్దరు వ్యక్తులు చెరొక బెర్తుమీదా కూర్చొని వున్నారు.

చూడగానే యిద్దరూ మౌనంగా వున్నట్టు తోచింది. కాని పరీక్షగాచూస్తే యిద్దరూ గంభీరంగా వున్నట్టుగాకూడా అనిపించింది. నాచేతులోవున్న సూట్‌కేసు పైబెర్తుమీద పెడ్దామని చెయ్యిపైకెత్తాను. అయితే అప్పటికే దానిమీద దాదాపు ఒకేరకంగావున్న రెండు లెదర్ సూట్‌కేసులున్నాయి. వాటినోప్రక్కకు సర్ది నా పెట్టెను పెడదామని ప్రయత్నించాను. ఆ పెట్టెల్ని అంటుకొనే సరికి ఆ యిద్దరు వ్యక్తులూ నావైపు చిరాగ్గాచూశారు. కాస్తకూ కూస్తకూ అలా ముఖం చిట్లించుకొనే వాళ్ళను చూస్తే నాకు మహాతలనొప్పి. అలాంటివాళ్ళతో ప్రయాణంచేయడం అంటే నాకెంతో అసహ్యంగా వుంటుంది. చాలామంది రైలు పెట్టెలు కూడా సొంతయిల్లే ననుకుంటారు. ఇళ్ళల్లో ఎలా తగలడ్డా బయటకొచ్చాకయినా సర్దుబాటుతనం వుండను.

నాపెట్టెను ఎదురుగా ఖాళీగావున్న రెండో చెక్కపైన పెట్టాను. సూట్‌కేస్ పైనవుంచి కిందబెర్తుమీద వోపక్కకు వొదిగి కూర్చొన్నాను. నే కూర్చొన్నాక కొంతసేపటికి రెండో వ్యక్తికూడా కొద్దిగా సర్దుకొని నాకుయింకొంచెం చోటు యిచ్చేడు. మామూలుగా రైళ్ళల్లో ప్రయాణంచేసేవాళ్ళ మనస్తత్వమే యిలావుంటుం దనుకుంటాను. ముందు పెట్టెలోకి ఎక్కగానే అంతకుముందునుంచీ అందులోకూర్చున్న వాళ్లు ఆ వచ్చినవాడెవడో తమసొంతయిల్లు ఆక్రమించటానికే వచ్చినట్టు భావిస్తారు. ఆ కొత్తగా ఎక్కిన వాడికి రైల్లో ప్రయాణంచేసే హక్కే లేనట్టుగా చూస్తారుకూడా. ఆ వచ్చినవాడూ అలాగే వొదిగి వొదిగి నుంచుంటాడు. కాని బండి స్టేషన్ వొదలగానే అంతవరకూ ఎక్కనిస్తే చాలనుకునే వాడల్లా ఎక్కడచోటుందా ఎవడు వదులొదులుగాకూర్చున్నాడాఅనే ప్రయత్నంలో పడ్తాడు. అంతవరకూ పట్టీపట్టనట్టున్న వాళ్ళు కాస్త అటూ యిటూ సర్దుకొని కొద్దిగా స్థలం యివ్వడం జరుగుతుంది. ఆ తర్వాత ఏవూరు మనది. దగ్గర్నుంచి సంభాషణ మీపెద్దమ్మాయికి కట్నం ఎంతిచ్చారూ అనేదాకా సాగుతుంది. కాని కొంతమంది తుమ్మమొద్దుల్లా, మాలకాకుల్లా కూర్చొనేవాళ్ళుకూడా వుండకపోరు!

ఈ ప్రపంచంతోనే సంబంధం లేనట్టుగా కూర్చొన్న నా తోటి ప్రయాణీకులకిద్దరికీ నేను పెట్టెలోకి ఎక్కడం కొంతఅంతరాయం కలిగినట్టుగా వాళ్ళ వాలకం చూస్తేనే తెలుస్తోంది.

ఆ యిద్దరూ నావంక చురుగ్గా వోసారిచూసి వొకరినొకరు వోరగా చూసుకొని ముఖం పక్కకు తిప్పుకొని కిటికీలోగుండా బయటికి చూడ్డం మొదలెట్టారు. ఆ చూపులూ, వాళ్ళనుచూస్తే నాకు అదో రకంగా వుంది.

నేను కూర్చున్న బెర్తుమీద కూర్చున్న వ్యక్తి కొంచెం బొద్దుగా, దృఢంగా చామనచాయగా వున్నాడు. నల్లటి నొక్కులజుట్టూ, సూదుల్లాంటి వాడిచూపులూ, ఎత్తయిననొసలూ, నల్లటిగుబురు కనుబొమలూ అవీ చూస్తే సినిమాల్లో "విలన్" పాత్రకు బాగా పనికివస్తాడేమోననిపించింది. అనిపించడమేమిటి "విలన్" వేషాలే వేస్తున్నాడో మరి నాకు తెలియదు! నల్లగీరల పేంటూ, తెల్లటి బుష్‌కోటూ వేసుకొని వున్నాడు.

నాకు ఎదురుగా బల్లమీదవున్న వ్యక్తి కొంచెం సన్నగా, ఎర్రగావున్నాడు. విశాలమైన నొసలూ

పెద్ద కళ్ళూ, వాడిముక్కూ దానిపైన నల్లద్దాల కళ్ళజోడూ వుంది. తెల్లని చొక్కా, లాగూ, మెరూన్ కలర్ టై కట్టుకొని వున్నాడు. అతనిదే కావొచ్చు నల్లటి కోటు అద్దం కిందగావున్న వంకెకు తగిలించివుంది. కళ్ళజోడు వున్నా అతడికి ముప్ఫై లేక ముప్ఫైయైదు వయస్సున్నట్లుంది. నా పక్కనే కూర్చున్న బుష్‌కోటు వ్యక్తి వయస్సు ముప్ఫైయైదు పైనా నలభైకి లోపుగానూ వున్నట్టుంది.

ఎక్స్‌ప్రెస్ ముప్ఫై నలభైమైళ్ళ వేగంతో పోతోంది. క్రింద పట్టాలరొద, ప్రక్కన గాలి హోరూ చెవులు గింగురుమంటున్నాయి. కాని వాళ్ళిద్దరికీ ఇదేమీ వినిపిస్తున్నట్టు లేదు.

వాళ్ళ వాలకం చూస్తే బాగా పరిచయమున్న వ్యక్తులు మాటలు ముదిరి తన్నుకొనేదాకా వచ్చాక మాట్లాడకుండా కూర్చున్నట్టుగానో, లేక అసలు పూర్తి అపరిచితుల్లాగానో వున్నారు. కదిలిస్తే పగిలే రబ్బరు బెలూన్లలాగా, యిప్పుడో యింకొంచెంసేపటికో బ్రద్దలవబోయే అగ్ని పర్వతాల్లా గంభీరంగా కూర్చొని, కిటికీలోగుండా బయటికి చూస్తూ, అప్పుడప్పుడు నావైపూ బల్ల మీదవున్న సూటుకేసుల వేపూ చూస్తున్నారు.

వాళ్ళ వాలకం చూస్తున్నకొద్దీ, నాకు అనుమానంగానూ, అయోమయంగానూ వుంది. నా పక్కన కూర్చున్న బుష్‌కోటు వ్యక్తిని పలకరించాలని చాలాసార్లు ప్రయత్నం చేశాను. నా వంకచూస్తూ నేను పలకరించబోయే సమయానికి మరో పక్కకు చూసేవాడు, అతడు కావాలని తప్పించుకొంటున్నకొద్దీ ఎందుకో అతన్ని పలకరించి మాటాడాలనే కోర్కె నాలో బలపడిపోతోంది.

ఓ అరగంట ప్రయత్నం చేశాక అడిగేశాను. ఏదో సర్దుకుంటున్నట్టు అటూయిటూకదిలి అతణ్ణి కాలితో తన్ని, అతడు ఇటు చూడగానే 'సారీ' చెప్పి "ఏ వూరు పోతున్నార"ని అడిగాను. నా కళ్ళల్లోకి అదోమాదిరిగా చూస్తూ అతడు "బెజవాడ." అని ముక్తసరిగాసమాధానంచెప్పేడు. తర్వాత సంభాషణ ఎలా పెంచుదామాఅని ఆలోచిస్తూంటే, ఎదురుగాకూర్చున్న వ్యక్తి మా యిద్దరివైపూ చూశాడు. వెంటనే అడిగాను:

"మీరు ఏవూరుపోవాలి?"

"బెజవాడే." సమాధానం చెపుతూనే ముఖం అటుతిప్పుకొన్నాడు.

ఇంతలోకే స్టేషన్‌లో బండి ఆగింది. పేపర్లమ్మే కుర్రాడి కేకవినపడింది. కుర్రాణ్ణి పిలిచి పేపరుకొన్నాను.

బండి స్టేషన్ వదిలింది. ఔటర్ సిగ్నల్ దాటి వేగంగాపోతోంది. మళ్ళీ గాలిహోరూ; పట్టాల రొద. నాతోటిప్రయాణీకులిద్దరూ తమవైపునున్న కిటికీలచెక్కలు కిందకువదిలారు.

నేను దినపత్రిక అటూ యిటూ తిరగేస్తూ కూర్చున్నాను. మూడో పేజీ మొదటి రెండుకాలమ్సులో తాటికాయంత అక్షరాల్లో వున్న వార్త నన్ను ఆకర్షించింది. అలాంటివార్తలు పక్కవాళ్ళతో సంభాషణలోకి దిగటానికి ఎంతో వుపయోగపడతాయి. ఆ వార్తాశీర్షిక యిలావుంది:

"నేషనల్ బేంకీ దోపిడి. 1,50,000 రూపాయల కరస్సీతో దుండగీడుల పరారీ. రాష్ట్రవ్యాపితంగా పోలీసుల గాలింపు!

దోపిడీదారుల ఆ చోకీ తెలిపినవారికి పదివేల రూపాయల బహుమతి!" —నేషనల్ బ్యాంకి మేనేజరు ప్రకటన.

శీర్షికకింద రెండుకాలమ్సూ దోపిడీతాలూకు వివరాలూ, వైనాలూ వున్నయ్ అదంతాపూర్తిగా చదివేదాకా నాకు మనసువుండబట్టలేదు. ఆత్రంగా పేపరుపక్కనున్న బుష్‌కోటువ్యక్తికి చూపిస్తూ అన్నాను:

"ఈవార్త చూశారా?"

"ఏవార్త? ఏదండీ?" అంటూ అతను నా చేతిలోంచి పేపరుతీసుకొన్నాడు. నేను "యీ వార్త చూశారా?" అనడం చెప్పకుండా తుపాకి పేల్చినట్టయింది. ఎలక్ట్రిక్ షాక్ తగిలినవాడిలా కిందనుంచి పైకి కదిలిపోయాడు. తెల్లటిసీడలు ముఖం మీద వాలిపోయినట్టయింది. గాభరాగా నా చేతిలోని పేపరు తీసుకొని ముఖానికి అడ్డం పెట్టుకొన్నాడు. కొద్ది క్షణాల తర్వాత బిగ్గరగా ఆవార్త చదివాడు. చదువుతూనే మనిషి మారిపోయాడు! ఎంతోబరువు దించినవాడిలా నిట్టూర్చి తేలికపడ్డాడు. ఉత్సాహంగా దోపిడీ వివరాలు చదవడం మొదలుపెట్టాడు.

అతడివాలకం నాకేమీ అర్థంకాక ఎదురుగా కూర్చున్న కళ్ళజోడు వ్యక్తికేసి చూశాను. కాని

అతడు యిదేమీ వినిపించుకొన్నట్టుగా కన్పించ లేదు. పూర్తిగా కిటికీవైపు తిరిగి కిటికీలోగుండా బయటికి చూస్తూవున్నాడు.

"దేశంలో అరాజకం ఎక్కువయిపోతోంది" పేపరుమడుస్తూ అన్నాడు నాపక్కనవున్న బుష్‌కోటాయన.

నేను నిజమే నన్నట్టు తలూపాను.

"పిళ్ళకు మామూలు శిక్షలు వేయకూడదు. కనపడ్డవాళ్ళను కనపడ్డట్టు కాల్చి పారేయాలి!" సీరియస్‌గా మొహంపెట్టి అన్నాడు బుష్‌కోటు వ్యక్తి మళ్ళీ.

"కాదు! వాళ్లను ప్రాణాల్తో పట్టుకొని చిత్రవధ చెయ్యాలి" ఎదురుగా కూర్చున్న కళ్లజోడు వ్యక్తి సర్రున వెనక్కు తిరిగి అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని చేతులమాదిరి రోమాలు లేచి నుంచొన్నయ్. మెడపక్కనకణతలమీద నరాలు వుబికినాయి.

"ఈ నెల్లో యిది అయిదో దోపిడీ." నల్ల అద్దాలు సర్దుకుంటూ అన్నాడు.

"పోలీస్‌శాఖ చేతగానితనం!" బుష్‌కోట్ ఆయన పెదవి విరుస్తూ అన్నాడు.

"ప్రజల్లో మందగొండితనం పెరిగిపోతోంది! అంతా అశ్రద్ధ! పోలీసుశాఖను నిందించి ఏం ప్రయోజనం?" కళ్లజోడు వ్యక్తి లేచివచ్చినా పక్కన కూర్చున్నాడు.

"ప్రజలే దొంగల్ని పట్టుకోనేట్టయితే పోలీసు లెందుకు?"—బుష్‌కోటు వ్యక్తి సిగరెట్ వెలిగించుకుంటూ.

"పోలీస్ డిపార్టుమెంటులో వున్నాళ్లంతా వట్టి యిడియట్సు" మాట్లాడటానికి ఏమీతోచక ఫూలిష్‌గా అన్నాను. వాళ్ళిద్దరూ నావైపు అదో రకంగాచూశారు. వాళ్ళ సంభాషణలో నాకు తలాతోకా తెలియలేదు. అంతకంటే ఏమీ అనటానికితోచక అలాఅనేశాను.

వాళ్ళిద్దరి వాలకం, మాటలధోరణీ చూస్తే వాళ్ళకు యీ దోపిడివిషయం అంతకుముందే తెలుసేమోననిపించింది. దాంతోపిళ్లకు పూర్తిగా సంబంధంకూడావుంటే మోననీ అనుమానంవేసింది. అలావున్నపాటున"షెర్లాక్ హోమ్సు" అయిపోదామనిపించింది.

"పోలీస్‌శాఖలో కొంతమంది యిడియట్స్ వున్నారనుకోండి. అంతమాత్రంచేత అంతా యిడియట్స్ అనే అభిప్రాయానికిరావడం శుద్ధ తెలివితక్కువ!" నల్లద్దాల్లోగుండా నన్ను చూస్తూ అన్నాడు. వాళ్ల సంభాషణలో ఒక్కొక్క మాటేవింటూంటే నాకు లోతు తెలియని గోతిలోకివొక్కొక్క మెట్టేదిగిపోతూన్నట్టుగావుంది!

ఆ నల్లద్దాల వ్యక్తి యింటలిజన్స్ బ్రాంచీ వుద్యోగేమోననిపించింది! అయితే రెండోవ్యక్తి ఎవరై వుంటారు? బ్యేంకీ మేనేజరా?

అయినా,నాలోవున్న డిటెక్టివ్‌స్పిరిట్ నన్ను అలా అనుకోనివ్వలేదు. ఏమైనా వాళ్ళిద్దర్లోఒక దొంగాడున్నట్టు నా కనుమానం! ఆ దొంగాడు వొకసారి నల్లద్దాలవ్యక్తిలోనూ, మరోసారి బుష్ కోటువ్యక్తిలోనూ కనీకనబడనట్టు కనపడి అంతట్లోనేమాయమౌతున్నట్టుగావుంది! ఏమైనావాళ్ళిద్దరిలో కనీసం ఒక్కడికైనా ఆదోపిడీతో సంబంధంవున్నటు నామనసు వూహించుకొంది.

అదంతా నా భ్రమేకావొచ్చు! వాళ్ల వ్యక్తిగతమైన మరేవిషయాలకారణంగానైనా వాళ్ల మనస్తత్వం, వాకలమూ అలా వుండివుండొచ్చు!

"ఈరోజుల్లో, దోపిడీచేసేవాళ్ల టెక్నిక్ చాలా పెరిగిపోయింది!" నల్లద్దాల కళ్లజోడువ్యక్తి నా మీదగా వంగి నాపక్కనవున్న అతనిదగ్గర్నుంచీ పేపరుతీసుకొంటూ అన్నాడు.

దొంగతనంచేసేవాళ్లకున్న తెలివితేటలు పట్టుకొనేవాళ్లకులేవు" వూరుకోలేక అదోమాదిరిగా గొంతుపెటి అన్నాను.

వాళ్లిద్దరూ ఒక్క సారిగా నావైపుచూశారు. వాళ్లనాలుగుకళ్ళూ నా కళ్లలో దేన్నో వెతకటానికి ప్రయత్నించినయ్.

వాళ్ళలా చూస్తుంటే, వూరుకున్న వాణ్ణి వూరుకుండలేక ఎందుకు అన్నానురా ఆ మాట అనిపించింది.

"ఇలాంటి దోపిడీలు బాగాచదువుకున్న వాళ్ళే చేస్తున్నారు!" నల్లద్దాల వ్యక్తి అన్నాడు.

"అవునవును. హైక్లాస్ పీపుల్సే హత్యలూ, దోపిళ్లూచేయడంవల్ల పట్టుకోటం కష్టమౌతోంది" అన్నాడు బుష్‌కోటు వ్యక్తి నొసలు ముడివేస్తూ.

"వాళ్ళు కూడా సూటూ, బూటూ వేయడము—"

"ఘరానా పెద్దమనుష్యుల్లా మాట్లాడడం-"

"సెకండ్ క్లాసులో ప్రయాణం చేయడం-"

నాతల బ్రెడ్డిల్లో పెట్టి నొక్కినట్టయింది! వాళ్ళ సంభాషణ ఏ వైపుకు తిప్పుకొస్తూంది వూహించుకుంటూంటే నాకు ముచ్చెమటలుపోసి పోతూన్నయ్. నా చూపుల్లో వాళ్ళవైపు చూసే శక్తికూడా లేకుండా పోయినట్టుంది.

వాళ్ళ మాటల ధోరణేకాకుండా, మనుషులు కూడా నావైపుజరిగి నన్ను అనుక్కూర్చున్నారు.

"డిటెక్టివ్‌లా కూపీలు తీయడమూ-"

"దోపిడీ చేసివచ్చినవాడే ముందు దోపిడీని గురించి మాట్లాడటమూ-" ఇంకా కళ్ళద్దాలవ్యక్తి ఏమన్నాడో నా చెవులు వినిపించుకొనే స్థితిలోనూ, మెదడు గ్రహించే స్థితిలోనూ లేవు.

పట్టాలమీదకాకుండా ఎక్స్‌ప్రెస్ నా గుండెల్లోనే పోతున్నట్టుంది.

వాళ్ళంటూన్న ప్రతి మాటలోను, చూస్తున్న ప్రతి చూపులోనూ నన్ను అనుమానిస్తోన్నట్టు నా గురించే మాట్లాడుతోన్నట్టు నాకుతోచింది. తోచడమేమిటి అంతా నాగురించే వాళ్ళ సంభాషణ! అప్పటికి వాళ్లు పోలీసు డిపార్టుమెంటుకి సంబంధించిన వాళ్ళనే నిర్ణయాని కొచ్చేశాను. కార్మం కాలి నన్ను లంకించుకోరు కదా? అమ్మ బాబోయ్! లక్షాఏభైవేల దోపిడీ కేసులోనే యిరికించడం.

"ఈ రోజుల్లో దొంగలు వుచ్చులో పడ్డాక కూడా తప్పించుకునే ప్రయత్నం మానరు!" అందులో ఎవడన్నాడో మరి.

ఆ మాట వినేసరికి నా గుండెకాయ కాస్తా గొంతులో కొచ్చి అడ్డం పడ్డది. నాతల తిరిగి పోతోంది. ఒకసారి పోలీసువాళ్ళ చేతుల్లోపడితే దొంగతనం వొప్పుకొని ఏ ద్వీపాంతర వాసమో పోయేదాకా మోక్షంలేదు.

బ్యాంకిధోపిడీతాలూకు రహస్యాలు చెప్పేదాకా పోలీసులు గొడ్డును బాదినట్టే బాదుతారు కాబోలు! ఇక నేను కలలోచూచో మా ఆవిడచేత సోడదిగించో చెప్పాల్సి వుంటుంది! అన్నట్టు ఆ దోపిడీతో నాకేంసంబంధం లేదుగా? అంతా ఏమిటో నాకు మతిపోతున్నట్టుంది! కాకపోతే బ్యాంకిదోపిడీతో నాకు సంబంధం ఏమిటి? నాదగ్గర లక్షాఏభైవేల రూపాయలు కాదుగాదా లక్షాఏభైవేల చిల్లపెంకులుకూడా లేవే? కావాలంటే నాపెట్టె సోదా చేసుకో!"

అంత అయోమయంలోనూ సంభాషణ మారుద్దామని ఓ వెర్రిప్రయత్నం చేశాను.

"ఏమండీ ఆ సూట్‌కేసు ఎక్కడకొన్నారు? బా-గుం-ది." ఎదురుగా బల్లమీదున్న సూట్‌కేసుల్ని చూస్తూ 'అన్నాను. ఎంతవెర్రిగా అన్నానో ఏమోమరి! నామాటవింటూనే మారిపోయిన వాళ్ళ మొఖాలనుచూస్తే నిజంగా నాకు భయంవేసింది.

అందులో నల్లద్దాల కళ్ళజోడువ్యక్తిలేచిపోయి ఆ సూట్‌కేసుల్లో వొకదాన్ని తీసుకొచ్చి మేం కూర్చొన్న బెర్తుపైచెక్కమీద పెట్టాడు. రెండోవ్యక్తి లేచిపోయి ఎదురుసీటులో కూర్చున్నాడు. ఆ రెండుసూట్‌కేసులూ వొకేరకంగా వున్నాయి. ఇద్దరూ వొకటీ, రెండూ, మూడూ అనుకొని రెండుపెట్టెల్లోంచి రివాల్వర్లు తీస్తారేమో? నారక్తంలో వణుకూ, తొందరగా ప్రవహించి పోతోంది.

మేం ముగ్గురం అనుమానం రేఖలతో భయం కోణాలుగా గలిగి గీయబడిన త్రిభుజంలా కూర్చున్నాం! నాపక్కన కూర్చున్న బుష్‌కోటువ్యక్తి భూమిగానూ, ఎదురుగా కూర్చున్న కళ్ళజోడువ్యక్తి భుజంగానూ, నేను లంబముగానూ వున్నట్టుందా త్రిభుజంలో! ముగ్గురం వొకళ్ళకు తెలీయకుండా మరొకళ్ళను చూసుకొంటూ వున్నాం!

రెండు వైపులనుంచీ వాళ్ళిద్దరూ నన్ను చూస్తోంటే మండుతూన్న నాశరీరంపై చమురు పోస్తూన్నట్టుగా వుంది. రానురాను నాశరీరంలో బాధనూ, అనుమానాన్నీ భయాన్నీ భరించేశక్తి లేకుండా పోతోంది! నామెదడులోనే ఫర్నేసూ గుండెల్లో బోయిలరూ పని చేస్తున్నాయి!

అట్లా అనుమానంగా చూస్తూ, దొంగ చూపుల్తో పొడిచి నన్ను చంపకపోతే నన్ను ఒక్కసారిగా పట్టుకోకూడదూ? ఆబాధ భరించేకంటే నేనే దోపిడీ దొంగనని ఒప్పుకోటమే మేలనిపించింది! రైలుపట్టాలు తప్పి పడిపోతూన్నట్టుగా వుంది! మెదడు కుతకుతలాడిపోతోంది! మతి చెలించిపోతోంది! గుండెల్లో దడ, శరీరంలో వణుకు, రక్తంలో నీరసం ప్రవహిస్తోంది!

ఇందులోంచి యెలా బయటపడటం? కిటికీలోంచి బయటికి దూకితేనో గొల్సులాగి బండి ఆపితే?

"నేనే దోపిడీచేసింది! నేనే దొంగను పట్టుకోండి. ఆ పెట్టెలోనే వున్నయ్ లక్షా యాభై వేలు తీసుకోండి. నేనే దొంగను! హంతకుణ్ణి! మేనేజర్ను కూడా హత్యచేసింది నేనే! పట్టుకోండి!" అని వెర్రిగా అరవాలనిపించింది. రెండు చేతుల్తో జుట్టు పీక్కుంటూ హఠాత్తుగా లేచి నుంచున్నాను, నేను అలా నిలబడీ నిలబడక ముందే ఆ యిద్దరూ ఒక్కదూకులో వెళ్ళి చెరో తలుపుదగ్గరా నిలబడ్డారు!

నాపై ప్రాణాలుపైకే పోయినై. నిరాశతో తిరిగొచ్చి నాచోటులో కూలబడ్డాను. తల్లో బరువుగానూ, గుండెలు విచ్చిపోతున్నట్టుగానూ వుండి నీరసంగా కళ్ళు మూసుకొని కూర్చున్నా. అంతా వొక పీడకలలా-మిస్టరీలా వుంది.

నేనువచ్చి కూర్చోగానే వాళ్ళిద్దరుకూడా తిరిగొచ్చి ఎదరిచోట్లో వాళ్ళు కూర్చున్నారు. ముగ్గురం నిశ్శబ్దంగా కూర్చున్నాం. అంతకుముందేమీ జరగనట్టే అపరిచితుల్లా కూర్చున్నాం. మొదట్లో నేను ఆ కంపార్టుమెంటులో ఎక్కినప్పు డెలావుందో యిప్పుడు సరిగ్గా అలానే వుంది మా పరిస్థితీ, వాతావరణమూను.

కృష్ణానది దాటి ఎక్సుప్రెస్ బెజవాడ స్టేషన్ లోకి వస్తోంది. బుష్‌కోటు వ్యక్తి అటువైపున్న వాకిలిదగ్గరకి నల్లద్దాల వ్యక్తి స్టేషన్ వైపున్న వాకిలిదగ్గరకూపోయి నిలబడి బయటికి వంగి తొంగిచూస్తూ వున్నారు. బండి ఆగుతూండగానే బుష్‌కోటు వ్యక్తి రెండోవైపునుంచి గబగబా కిందకు దిగేడు తన సూట్ కేసును తీసుకోవడం మర్చిపోయి. అతను అలా సూట్ కేసు వదిలిపెట్టిపోవటం చూసి, నల్లద్దాల వ్యక్తి గిరున వెనక్కు తిరిగివెళ్ళి సూట్ కేసును అతని చేతికందిస్తూ అన్నాడు:

"ఏమండోయ్! సూట్ కేసు మర్చిపోయి వెళ్తున్నారు!"

గంభీరంగావుండే ఆ దృఢకాయుడి ముఖం తెల్లబడిపోయింది. వణుకుతూన్న చేత్తో సూట్ కేసును కళ్ళజోడువ్యక్తినుంచితీసుకొని, "థేంక్స్" అంటూ రెండోప్లాటుఫారంమీద ఆగివున్న బండి దగ్గరకు త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

అతడు సూట్ కేసును తీసుకొని వెళ్ళిపోగానే నల్లద్దాలవ్యక్తి కళ్ళజోడుతీసి పాంట్ జేబులో పెట్టుకొన్నాడు. ఎంతోబరువును దించేసుకొన్న వాడిలా తేలికపడి నిర్వికారంగా కూర్చున్నాడు. అతడి వాలకం పూర్తిగా మారిపోయింది. అతని ముఖంచూస్తే అంతకుముందునుంచీ నాతో ప్రయాణంచేస్తూన్న వ్యక్తేనా అన్నంత మార్పు వచ్చింది. వుత్సాహంగావున్నాడు.

నాపెట్టె తీసుకొని బండిదిగబోతూండగా, యిద్దరు పోలీస్ యినస్పెక్టర్లూ, యింకోనలుగురు మఫ్టీడ్రస్సులోనూ లోపలికొచ్చారు.

అందులో వొకడు మా టికట్స్ తీసుకొని చూశాడు. తర్వాత పెట్టెసోదాచెయ్యాలన్నారు నా పెటె తెరచిచూపించాను. నా పెట్టెచూశాక అతణ్ణికూడా "మీ సూట్ కేసుకూడా కొంచెం చూపిస్తారా?" అని మఫ్టీడ్రస్సులోవున్న వాళ్లల్లో ఎత్తుగా, లావుగావున్నాతడు అడిగాడు.

"ఓ యస్!" అంటూ అతడు సూట్ కేసుతీసి వాళ్ళముందుపెట్టి తెరవటానికిప్రయత్నంచేశాడు. కాని అతనిదగ్గరున్న తాళంచెవి దానికిపట్టలేదు.

"సారీ! కీ యింటిదగ్గర మారుపడివుంటుంది. కావాలంటే మీరు తాళంపగలకొట్టి చూసుకోవచ్చు!"

అందులో వొకడు స్టేషన్‌మాష్టర్ గదిలోకిపోయి యినపకడ్డీవొకటితీసుకొచ్చి బలవంతంగా తెరిచాడు.

పెట్టెతెరచి చూడగానే అందరిముఖాల్లో ఆశ్చర్యం, భయం తొణికింది! ఆ కళ్ళజోడువ్యక్తి ముఖంమీద యాటంబాంబు పేల్చినట్టయింది!

ఆ పెట్టెలో గడ్డకట్టుకుపోయి చిక్కటిరక్తం మడుగులో మొండెంనుంచి వేరుచేయబడ్డ వొక తలా రెండుచేతులూ వున్నయ్!

వెంటనే ఆ నల్లద్దాలవ్యక్తి రెండుచేతులూ కలిపి బేడీలువేసి ఆ పెట్టెనూ, అతణ్ని తీసుకుపోయారు పోలీసులు.

నా మెదడులో మెరుపులా వొక్కవూహ మెరిసింది! ఒక్కదూకులో బండిదిగి బుష్‌కోటు వ్యక్తి ఎక్కిన రైలుదగ్గరకు పరుగెత్తాను. అప్పుడే రైలు కదిలి పోతోంది. ఒకపెట్టెలో బుష్‌కోటువ్యక్తి కనిపించాడు. పరుగెత్తుకుపోయి

ఆ వెనక పెట్టె కడ్డీలు పట్టుకొని వ్రేలాడి ఎలాగో ఎక్కగలిగాను.

రైలు ఔటరు సిగ్నల్ దాటి వేగంగా పోతోంది. నాలో ఆతురత పెరిగిపోతోంది. పక్క స్టేషన్‌లో ఎప్పుడుబండి ఆగుతుందా ఎప్పుడు ఆ పెట్టెలోకి పోదామాఅని. ఇది నా అదృష్టానికి అంత్యపరీక్ష! నా హృదయంలో గిలిగింతలు చెలరేగుతూన్నయ్! బుర్రలో వుప్పెనలా పొంగివస్తున్నాయి ఆలోచనలు.

బండి క్రిష్ణాబ్రిడ్జీమీదగా పోతోంది. కిటికీలో గుండావంగి ముందుపెట్టెవంకే చూస్తూ వున్నాను. కనకదుర్గ కొండచాటుకు సూర్యుడు పోయాడు. పచ్చని చేల్లోంచి నిండుచంద్రుడు పైకొస్తున్నాడు. కృష్ణవేణి తెల్లటి వెన్నెలతో జలకమాడుతోంది.

ముందుపెట్టెవైపు తదేకదీక్షగా చూస్తూ వున్నాను. మాపెట్టె వంతెనమధ్యకు రాగానే ముందుపెట్టెలోవున్న బుష్‌కోటువ్యక్తి సూట్‌కేసును మెల్లగా నదిలోకి విసరివేశాడు. అది తెల్లటి వెన్నెల్లో మెరుస్తూ గుండ్రంగా తిరుగుతూ పోయి పొంగిపొరలి ప్రవహిస్తోన్న ప్రవాహంలో మునిగిపోయింది. నా అదృష్టం, నా ఆశలూ, దాంతోనే మునిగిపోయినై. కృష్ణాకెనాల్ స్టేషన్‌లో బండి ఆగీ ఆగకముందే దిగి ఆ బుష్‌కోటువ్యక్తి పచ్చటి వరిచేలకు అడ్డంపడి మెల్లగా నింపాదిగా నడుస్తూ వెళ్లిపోయాడు.

కథానిక

# చెప్పలేని ఆత్మీయత

యం. వి. యన్. కృపారావు

“మందులషాపు” అని తెల్లటి అక్షరాలు తళతళా మెరుస్తున్నాయి నల్లబోర్డు మీద ఎండబాగాపడి. దగ్గరదగ్గర మధ్యాహ్నం పన్నెండవుతోంది. బజార్లో జనంకూడా బాగా తగ్గిపోయారు. తనకొట్టులో స్తంభానికి పక్కగా వేళ్ళాడకట్టబడిన ఆ చిన్న బోర్డువైపు కాసేపు, బజార్లో అప్పుడప్పుడు వచ్చేపోయే ఒకరిద్దరివైపు కాసేపుచూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు సముద్రయ్య. పొద్దున్నుంచి ఇప్పటివరకూ ఒక కానీ కూడా అమ్మకంలేదు. ఇప్పటికి తనకొట్టువయస్సు దాదాపు పాతిక సంవత్సరాలు. మొదట్లో ఆ వూరంతటికీ ఇదివొక్కటే మందులషాపు. లాభం కూడా అప్పట్లో బాగావచ్చేదే. షాపు ఎప్పుడు చూసినా చాలసందడిగా వుండేది. ఇద్దరు గుమాస్తాలు, ముగ్గురు చేతికిందమనుష్యులూ, మసులుతూండేవాళ్లు. కాని, ఇప్పుడో ఎక్కడచూసినా మందులషాపులే. తనషాపు అప్పటికీఇప్పటికీ ఆకారంలో, అందంలో ఏమాత్రం మారకపోయినా, కొత్తగా వొస్తున్న మెడికల్ షాపులన్నీ తళతళలాడే కొత్తగా ఫర్నిచర్‌తో, రెఫ్రిజరేటర్లతో, రంగురంగుల సీసాలతో, అందంగా అమర్చబడి శ్రావ్యమైన పాటల్ని వినిపించే రేడియోలతో చూట్టానికి ఎంతో ఆకర్షణీయంగావున్నయ్. అమ్మకం ఎక్కువలేకపోవటంవల్ల మందులుకూడ ఎక్కువ తెప్పించటంలేదుతను. పైగా పనివాళ్లందర్నీ మానిపించి బాగా నమ్మకమున్న ఒకతన్ని మాత్రం అట్టేపెట్టాడు. ఆనందయ్య తన ఈడువాడు. తను పెట్టినప్పట్నుంచీ కనిపెట్టుకుని వున్నాడు. చేసేపనేమీలేక బీరువాకు ఆనుకుని జోగుతూవచ్చేనిద్రను ఆపటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. షాపు చాలాశూన్యంగా వుంది. సముద్రయ్యకి ఏమీతోచటంలేదు. రిటైరై ప్రాక్టీసుమానుకున్న తనస్నేహితుడు డాక్టరుదత్తు కూడరాలేదు ఇవాళ. దత్తు రోజూ ఉదయాన వచ్చి ఏదో బాతాఖానీ వేశేవాడు. తనతోపాటే ఇంటికి వెళ్లిపోయేవాడు. అతను ఈరోజు ఎందుకు రాలేదోనని ఆలోచిస్తున్నాడు సముద్రయ్య.

ఇందాక బజార్లో కనబడుతున్న ఒకళ్లిద్దరుకూడా తగ్గిపోయారు. షాపులన్నీ మూసేసినట్టున్నారు. బజారు చాలాశూన్యంగావుంది. ఇంకా పదినిముషాల్లో తనుకూడా షాపు కట్టేయాలనుకుంటున్నాడు. అయినా తన షాపు ఎప్పుడు కట్టేసినా ఒకటే. అటు ఆనందయ్యకూ తొందరలేదు ఇటు తనకు అంతకన్నా తొందర్లేదు—అసలు షాపు తెరిచివున్నా ఎవరూరాకపోవటంచేతా మనుషులు ఎక్కువగా లేకపోవటంవలనా, ఎప్పుడూ